ఆర్.డి.టి

ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం మార్చి 2005

FOR PRIVATE CIRCULATION ONLY

"ఈ మాసపు సమాచారం" ప్రారంభించి ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా వాటర్‌షెడ్ గ్రామాల ప్రజలకు, కమిటీల సభ్యులకు, రైతులకు, ప్రభుత్వ అధికారులకు మరియు ఆర్.డి.టి. సిబ్బందికి శుభాభినందనలు.

మీ

## మీకు తెలుసా !

- ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద పొగాకు ఉత్పత్తిదారులు, వాడకందారులున్నది మన దేశంలోనే.
- ప్రస్తుతం పొగ త్రాగడంవల్ల ప్రతి సంవత్సరం 8-9 లక్షల మంది జబ్బుపడి చనిపోతున్నారని అంచనా.
- ఇతరత్రా కారణాలమీద చనిపోయేవారికంటే 36 శాతం సిగరెట్లు త్రాగేవారు, 68 శాతం బీడీలు త్రాగేవారు అధికంగా చనిపోతున్నారు.
- మొత్తం దేశంలోని 25 కోట్లమంది పొగాకు వాడకందారులలో 13 శాతం మంది సిగరెట్ల రూపంలోనూ, 54 శాతం మంది బీడీల రూపంలోనూ, మిగతావారు నేరుగా పొగాకు, గుట్కా తదితరాలు వాడుతున్నారు.
- 2000-2001 సంవత్సరంలో పొగాకు ఉత్పత్తులమీద వేసిన పన్నులద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 8,200 కోట్ల రూపాయలు, ఎగుమతుల సుంకంమీద వచ్చిన ఆదాయం 900 కోట్ల రూపాయలు.
- 2001-2002 సంవత్సరంలో పొగాకు సంబంధిత జబ్బులమీద ప్రజలు ఖర్చుచేసినది 30,833 కోట్ల రూపాయలు. ఇందులో గుండెకు సంబంధించిన రోగాలమీద 13,970 కోట్ల రూపాయలు, ఊపిరితిత్తుల వ్యాధులమీద 10,357 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.
- 1962-2002 మధ్య కాలంలో పొగాకు బ్యారన్లలో మండించడానికి 8,680 టన్నుల కలప వాడారు. ఇదే కనుక థర్మల్ విద్యుచ్ఛక్తి ఉత్పాదనకు వాడినట్లైతే, ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు ఒక సంవత్సరంపాటు సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు.

(డౌన్ టు ఎర్త్, జనవరి 31, 2005 సంచిక నుండి)

**చిట్కా :** దగ్గు, జలుబుకు పది గ్రాముల పటిక పొడిని నీటిలో కరిగించి రెండు లవంగాలు వేసి పొంగిస్తే, పటిక పొంగి గట్టిపడుతుంది. దానిని నూరి చిటికెడు పొడిని తమలపాకులలో ఉంచి నమిలి మింగితే ఉపశమనం దొరుకుతుంది.

## వలసల్ని ఆపుదాం ! పనికి ఆహారం పథకాన్ని సద్వినియోగం చేసుకుందాం !

గ్రామాల్లో పనులు లేనప్పుడు, ఇతర ప్రాంతాలకు ఉపాధికోసం వెళ్ళడం, వర్షాలు వస్తూనే తిరిగి రావడం మన జిల్లాలో కొత్తకాదు. అయితే గత 7-8 సంవత్సరాల వరకూ కర్నాటక, చిత్తూరు జిల్లాకు సరిహద్దున ఉన్న గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ కూలీలు మాత్రమే వలస వెళ్ళేవారు. కర్నాటకలోని కోలారు, చిత్రదుర్గ, మరికొంతమంది బెంగుళూరు పరిసర ప్రాంతాలలోని వ్యవసాయ తోటల్లో పనికి పోయేవారు. చిత్తూరు జిల్లా సరిహద్దుకు ఆనుకుని వున్నవారు చిత్తూరు జిల్లాలోని బెల్లం బట్టీలలో పనికి కుదిరేవారు. వలసలు పోతున్నవారు, ఇంటి దగ్గర ముసలివాళ్ళని, చిన్నపిల్లల్ని గొడ్డుగోదాల్ని వదిలి, వారికి భత్యం ఏర్పాటు చేసిపోతారు. కుటుంబంలో శారీరక కష్టం చేయడానికి శక్తి సామర్థ్యాలు ఉన్నవారు మాత్రమే వలస వెళ్తారు. పోయినవారు తోటల్లోని పంపు రూముల్లోనూ, గ్రామంలోని సత్రాల్లోనూ గుంపులుగా కాపురం ఉండి పనులు అయిపోయిన వెంటనే తిరిగి ఇంటికి వచ్చే అలవాటు ఉంది. ఈ రకంగా మన జిల్లాలో వ్యవసాయ పనులులేని కాలంలో వలసలు వెళ్ళి రావడం కొత్తేమీ కాదు. వీరు పనికి పోయిన ప్రాంతంలోని పొలం, తోటల యజమానులు ఆయా గ్రామాల గ్రామస్థులు కూడా వీరిని బాగానే చూచేవారు. వలస వెళ్ళినవారికి సమస్యలు ఉత్పన్నం కావడం చాలా అరుదుగా ఉండేది.

అయితే గత 7-8 సంవత్సరాల నుండి మన జిల్లా నుండి వలస వెళ్ళేవారి సంఖ్య పెరుగుతోంది. మామూలుగా వలస వెళ్ళే వ్యవసాయ కూలీలే కాకుండా, ఏనాడూ ఊరి పొలిమేరలు దాటని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కుటుంబాలలోని యువకులు కూడా పనులకోసం ఇతర ప్రాంతాలకు వలస పోవడం ఎక్కువయింది. 15-20 ఎకరాల రైతు కుటుంబాలకు చెందిన యువకులు, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు సైతం బెంగుళూరులోని కోళ్ళ ఫారాలలో పనికి కుదురుతున్నారు. మామూలుగా వర్షాలు రావడంతోనే ఇళ్ళకు తిరిగిరావడం కాకుండా, కొంతమంది అక్కడే ఉండిపోతున్నారు. ఈరకంగా పని ఉన్న ప్రాంతాలకు వలసలు పోవడం, తిరిగి ఇళ్ళకు చేరడం మన జిల్లాలోనే కాదు, దేశంలోని మెట్ట ప్రాంతాలలో నివసించే అందరి పరిస్థితి ఇదే.

అయితే గడచిన 5-6 సంవత్సరాలుగా మన జిల్లాలో వలస పోయేవారి శాతం ఎక్కువయినట్లే, ఇతర ప్రాంతాలనుండి కూడా పనుల కోసం వలసలు వెళ్ళడం ఎక్కువయింది. ఫలితంగా అనారోగ్యకరమైన పోటీ ఏర్పడి తక్కువ కూలీకే, ఎక్కువ పని గంటలలో పనులు చేయించుకుంటూ దోపిడీకి పాల్పడుతున్నారు. కొన్నిచోట్ల కేబుల్ గుంతలు తవ్వడానికని కంట్రాక్టర్లు తీసుకువెళ్ళి, ఒక నెలా-నెలన్నర పనులు చేయించుకుని కంట్రాక్టర్లు మోసంచేసి ఉడాయించిన సందర్భాలు కూడా వున్నాయి. అదేమని ప్రశ్నించిన వారిమీద దొంగతనం కేసులుపెట్టి జైలుకు పంపుతామని బెదిరించడాలు కూడా జరుగుతున్నాయి. అన్నిటికంటే ముఖ్యమైన సమస్య ఏమిటంటే, కొన్నిచోట్ల వీరి వస్తువులు దొంగతనాలకు గురికావడం, మహిళలపై లైంగిక వేధింపులు, వారికి మాయమాటలు చెప్పి, వంచించడానికి

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" – ఉపనిషత్తులు

కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు కొన్ని సంఘటనలు చెప్తున్నాయి. కొన్ని సందర్భాలలో మహిళలు బయటికి చెప్పుకోలేక అవమానాలు దిగమింగుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పనికి ఆహార పథకాన్ని గురించి ఆలోచించాలి.

### జాతీయ పనికి ఆహార పథకం - కరువు జిల్లాలకు ఒక వరం :

ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశంలో తరచుగా కరువుకు గురవుతున్న ఐదు జిల్లాల్లో పనికి ఆహార పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎంపిక చేసిన జిల్లాల్లో మన అనంతపురం జిల్లా కూడా ఒకటి. దీని ప్రకారం గ్రామాల్లో పనులు కోరేవారందరికీ పనులు కల్పించాలని దీని ముఖ్య ఉద్దేశ్యం. ఒకరకంగా ఇది మన జిల్లాకు వరంలాంటిది. ఈ పనులు అన్నీ కూడా శారీరక శ్రమతో కూడుకున్నవిగానే ఉంటాయి. యంత్రాలు గానీ, ఇతరత్రా వాటికి గానీ (అంటే రాళ్ళు, సిమెంట్, ఇనుము తదితరాలు) ఖర్చు పెట్టరాదు. ఎన్ని పనిదినాలు కల్పించగలమన్నది ప్రధాన ఉద్దేశ్యంగా ఉంటుంది. ఈపాటికే జిల్లాలో అక్కడక్కడా పనులు ప్రారంభించారు. చేయించే పనులలో 50 శాతం పనులకు బియ్యం, యాభై శాతం డబ్బు రూపేణా పంపిణీ చేస్తున్నారు. ఈ పనులు ప్రారంభించడంలోనూ, వాటిని పర్యవేక్షించడంలోనూ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టరుగారు, జాయింట్ కలెక్టరుగారు, చాలా పట్టుదలగా పథకాల అమలుకు కృషిచేస్తున్నారు. కూలి రేట్లు కూడా ఒక్కొక్కరికి కనీసం రూ.100/-లు గిట్టుబాటు అయ్యేలా పని రేట్లు రూపొందించారు. ఈ 2005-06 సంవత్సరం నుండి ప్రతి ఏటా 60 కోట్ల రూపాయలు ఇందుకోసం ఖర్చు చేస్తారని అంచనా. ఈ పథకం అయిదు సంవత్సరాలపాటు అమలులో ఉంటుంది. ఇప్పటికే మన జిల్లాలో 18 కోట్ల రూపాయల పనులు మంజూరు చేసినట్లు, 4,400 పనులు ప్రారంభించినట్లు అధికారులు ప్రకటించారు. కూలీలకు అవసరమయ్యే పనిముట్లను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తోంది.

### పథకం అమలులో ఎదురయ్యే సమస్యలు :

ఏ పథకమైనా అనుకున్న రీతిలో విజయవంతం కాదు. ప్రభుత్వ పథకాలు రూపొందించడం, కాగితాలమీద నిధులు కేటాయించి, విడుదల చేయడం సులభం కావచ్చును. కానీ, పథకాల అమలుస్థాయిలో అసలు సమస్యలు ఉత్పన్నమౌతాయి. ఇందులో కొన్ని సమస్యలు యాధృచ్ఛికమైతే చాలావరకూ సమస్యలు అధికార యంత్రాంగం, స్థానిక రాజకీయ నాయకులవల్ల వస్తాయి. యాధృచ్ఛికమైన సమస్యలు ఏమిటంటే, ఒక పనిని గుర్తించినప్పుడు నేల గట్టిగా ఉండి పనులు జరుగక, పనులు అర్థాంతరంగా ఆగిపోవడమో, లేదా అసలు ప్రారంభం కాకపోవడయో జరుగుతుంది. దీనివల్ల పనులు జరగకపోగా, కూలీలకు పనులు లేకుండాపోతాయి. గత రెండు సంవత్సరాలుగా మన జిల్లాలో కొన్ని పనులు ఇలాగే మూలపడినాయి. రెండో రకం సమస్యలు రాజకీయనాయకులు, గ్రాస్‌రూట్ లెవల్ అధికార యంత్రాంగం వల్ల వస్తాయి. అవినీతికి అలవాటుపడిన కొంతమంది అధికార యంత్రాంగం, చోటా రాజకీయ నాయకులు కలిసి పనులను కంట్రాక్టరు పద్ధతిలో దారిమళ్ళించే విధంగా ప్రయత్నం చేస్తారు. పోయినసారి జిల్లా అధికారులు యంత్రాలతో పనులు చేయించరాదని ఎంత గట్టిగా వార్నింగ్ ఇచ్చినా, కొన్ని చోట్ల రాత్రికి రాత్రి యంత్రాలతో పనులు చేయించినారు. పైగా పనుల పర్యవేక్షణ కొరవడడం వల్ల కొన్ని చోట్ల మండల స్థాయి అధికారులకు ఆడింది ఆట పాడింది పాట అనే విధంగా కొనసాగింది. జిల్లా ఉన్నతాధికారులు నిజాయితీగా ఉంటేనే సరిపోదు. క్రింది స్థాయి సిబ్బంది ముఖ్యంగా మండల స్థాయిలో ఇంజనీరింగ్, అధికారులతో నిజాయితీగా ప్రజల సంక్షేమ దృక్పథంతో పనిచేయించేటట్లు చూడగలిగినప్పుడే ఈ పథకం ఆశించిన ఫలితాలనిస్తుంది. అదృష్టవశాత్తూ, ఈ మధ్యకాలంలో మంచి జిల్లా కలెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్లు మన జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుత జిల్లా కలెక్టరు శ్రీమతి అనురాధ, ఐ.ఏ.ఎస్.,గారు జిల్లా అంతటా పర్యటిస్తూ, సమస్యలను చక్కగా ఆకళింపు చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నారు.

### పనికి ఆహార పథకాన్ని ఉపయోగించుకోవడంలో మన పాత్ర :

గతంలో ప్రభుత్వం ద్వారా చేపట్టిన పథకాలన్నీ దాదాపు దళారుల పాలుకావడమో లేదా పక్కదారులు పట్టడమో చూసిన అనుభవంతో ప్రజలకు ఈ పథకం పట్ల ఇంకా పూర్తి విశ్వాసం ఏర్పడలేదు. అందుకే అధికారులు ఎన్ని ప్రకటనలు చేసినప్పటికీ, ఎప్పటిలాగానే ఈసారి కూడా చాలామంది గ్రామాలు ఖాళీ చేస్తూ వలస వెళ్ళిపోయారు. బయట రోజుకు రూ.100/-లు కూలి గిట్టుబాటు అయినా, స్వంత ఊరులో రూ.50/-లు కూలి దొరికితే ఇదే ఎక్కువ అనే అభిప్రాయం కూడా చాలామంది వలస వెళ్ళేవారిలో ఉంది. దీనికోసం మండల స్థాయిలో అధికారులతో ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేసి, ఏయే గ్రామాలలో ఎవరు వలస వెళ్ళారో తెలుసుకొని అక్కడ కుటుంబంలో ఉన్న మిగతావారికి నచ్చజెప్పితే, పోయిన వారంతా తిరిగి వస్తారు. ఇలా వచ్చినవారికి, వారి జీవనానికి సరిపోయేటట్లుగా నెలకు కనీసం 15 రోజులు గ్యారంటీ పని కల్పించాలి. ఈ పనికి ఆహార పథకాన్ని గురించి, వాటి ఉపయోగాన్ని ప్రజలందరికీ అవగాహన కల్పిస్తే, పథకం అమలుపర్చే అయిదు సంవత్సరాలలో వలస వెళ్ళే వారి సంఖ్య తగ్గిపోతుంది.

పైన వివరించినట్టుగా, అంత సులభంగా ఏ పథకం మనవద్దకు రాదు. ప్రతి గ్రామంలోనూ ఎవరెవరు పనులు చెయ్యగలరో, పనులు కావాలని కోరుతున్నారో, వారందరూ కలిసి తమకు పని కావాలని మండల స్థాయి అధికారులను సంప్రదించాలి. ఒకవేళ ఈ క్రమంలో ఇబ్బందులు ఏర్పడితే వ్రాతమూలకంగా జిల్లా కలెక్టరు గారికి ఫిర్యాదుచేస్తే వారికి పనులు కల్పిస్తారు. మరింకో ముఖ్య విషయమేమిటంటే, గడచిన సంవత్సరంలో జిల్లా అధికారులు పట్టుదలగా కంట్రాక్టరు పద్ధతి ఉండకూడదని నిక్కచ్చిగా ఆదేశాలు ఇచ్చినా, పనులు కూలీల పేరుతో, కూలీలు తామే స్వంతంగా పనులు చేసినట్లుగా బినామీ రికార్డులు తయారుచేసుకుని కంట్రాక్టర్లు అక్కడక్కడా చేసినట్లుగా నా పరిశీలనలో గమనించినాను. అనుమానం వచ్చి అడిగితే, పనిచేస్తున్నవారు తామే పని చేసుకుంటున్నట్లు చెప్పినారు. కానీ, బినామీ కంట్రాక్టర్ల పేర్లు చెప్పలేదు. ఇది ఒకరకంగా కూలీలు కూలీలకే అన్యాయం చేసుకుంటున్నట్లు లెక్క, ఈ ధోరణి నుండి బయటపడాలి.

వలసలవల్ల తాత్కాలికంగా ఉపాధి పొందవచ్చునుగానీ, దీర్ఘకాలంగా అది మన కుటుంబ వ్యవస్థపట్ల తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇంటిపట్టున ఉండే వృద్ధులు సరైన ఆలనాపాలనా లేకుండా తీవ్రంగా జబ్బుపడతారు. జబ్బు పడినవారికి వైద్య సహాయం దొరకదు. పిల్లల విద్యావకాశాలు దెబ్బతింటాయి. తల్లిదండ్రుల ప్రత్యక్ష పర్యవేక్షణలేక పిల్లలు గాలికి తిరిగే అవకాశముంది. ఇల్లు, గొడ్లు, గోదా ఇవన్నీ నిర్లక్ష్యానికి గురవుతాయి. బయటికి వెళ్ళిన మగవారు క్రొత్త అలవాట్లు నేర్చుకునే ప్రమాదం ఉంది. కుటుంబం అనేది కేవలం ఆర్థిక సంబంధాలమీదే నడవదు. తల్లి, తండ్రి, అన్నలు, తమ్ముళ్ళు, అక్కలు, చెల్లెళ్ళతో సజీవ మానవ సంబంధాలమీద కుటుంబం నడుస్తుంది. కుటుంబం మానవ సంబంధాల బాటలో నడిస్తే, సమాజం, ఊరు, దేశం కూడా మానవ సంబంధాల బాటలోనే నడుస్తాయి. కుటుంబం విచ్ఛిన్నమైనప్పుడు, సమాజంలో కూడా విచ్ఛిన్న పోకడలు వస్తాయి. అందుకే సాధ్యమైనంతవరకూ కుటుంబ సభ్యులు విడిపోకుండా బతకడం నేర్చుకోవాలి. దానికోసం జాతీయ పనికి ఆహార పథకాన్ని ఒక మంచి అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తూ ఉన్నాను.

మీ విశ్వసనీయుడు,

**వై. వి. మల్లారెడ్డి**

డైరెక్టరు - ఎకాలజి

ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్

## వాటర్‌షెడ్ గ్రామాల వార్తలు

హనిమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సి. ఆంజనేయులు అను నేను 2001-2002 సం॥లో "పెబ్బుల్ బండింగ్" పని 20 ఎకరాల పొలంలో చేయించుకొన్నాను. ఈ సంవత్సరం నా పొలంలో వేరుశనగ సాగుచేసినాను. ఇంతకు ముందు పంట దిగుబడి ఎక్కువ వచ్చేది కాదు. కాయ ఊడలు భూమిలోకి పూర్తిగా దిగక గాలిలోనే ఉండి, మొక్క ఎదుగుదల కూడా సరిగ్గా ఉండేది కాదు. కలుపులు కూడా ఎక్కువ పడేవి, కూలీల ఖర్చు ఎక్కువ అయ్యేది. సేద్యం చేయుటకు కూడా చాలా ఇబ్బందిగా ఉండేది.

ప్రస్తుతం నా పొలంలో గడ్డి ఎక్కువ పడటంలేదు. సేద్యం త్వరగా అవుతున్నది. కూలీల ఖర్చు కూడా తగ్గింది. మొలకలు మొలకెత్తు శాతం పెరిగింది. ఈ సం॥ నా పొలంలో పశువుల పేడ తోలినాను. మరియు డి.ఏ.పి. విత్తేటప్పుడు విత్తనంతోబాటు విత్తినాను. అరకొరగా వచ్చిన వర్షానికి నీరు అక్కడికక్కడే ఇంకి నా పొలంలో పైరుకు తంపు ఎక్కువ రోజులు పట్టి ఉండేటట్లు చేసింది. ఫలితంగా మొక్కల ఎదుగుదల పెరిగింది. కాయల నాణ్యత కూడా పెరిగింది. ఒక్కొక్క మొక్కకు కాయలు 40 నుంచి 70 వరకు వచ్చినాయి. ఈ పెబ్బుల్ బండింగ్ నాకు ఎంతగానో ఉపయోగపడింది.

**- సి. ఆంజనేయులు, రైతు - హనిమిరెడ్డిపల్లి గ్రామం.**

### కూలీల జీవన విధానంలో మార్పు :

మా రుద్రంపల్లి గ్రామంలో వాటర్‌షెడ్ కార్యక్రమాలు 1998 సం॥లో ప్రారంభమైనాయి. నేను వాటర్‌షెడ్ ప్రారంభమయ్యినప్పటి నుండీ, బండింగ్, హార్టికల్చర్, నీటి సంరక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. వాటర్‌షెడ్ ప్రారంభం కాకమునుపు చాలా బీదరికంలో బ్రతుకుతున్న కుటుంబం మాది. ఎప్పుడు కూలుతుందో తెలియని ఇంటిలో నివాసం ఉండేవాళ్ళము. నాకు కుంటకట్టలు పనులు బాగా ఉపయోగపడినాయి. ఈ పనుల ద్వారా సంవత్సరానికి దాదాపు రూ.12,000/-లు వరకు సంపాదించగలిగాను. ఈ మొత్తంతో ఇంటి నిర్మాణం కొంతకొంతగా చేయడం మొదలుపెట్టాను. మూడవ సంవత్సరానికి ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయ్యింది. వాటర్‌షెడ్ పనుల ద్వారానే మా అక్కకు వివాహం చేయగలిగాను. మాకు ఉన్న 5 ఎకరాలతోపాటు ఇంకొక 5 ఎకరాలు గుత్తకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ప్రత్యేకంగా ఈ సంవత్సరం 1350 రూపాయలు పోస్టాఫీసులో పొదుపు చేయగలిగాను.

"కష్టపడితే ఏ పనైనా సాధించగలం" అనే నానుడిని స్పష్టంగా తెలుసుకోగలిగాను.

**- కె. నాగరాజు, రుద్రంపల్లి గ్రామం.**

### సమగ్ర సస్యరక్షణపై లబ్ధిదారుని అభిప్రాయం.

ఎర్రిస్వామి అను నేను కోనంపల్లి గ్రామంలో నాకున్న 8 ఎకరాల పొలంలో ప్రతి సంవత్సరం వేరుశనగ పంట వేస్తున్నాను. కానీ, విత్తన శుద్ధి ఒక్కసారి కూడా చేయలేదు. ప్రతి సంవత్సరం వేరుశనగ మొలకెత్తిన తర్వాత 30 శాతం మొక్కలు సాళ్ళకు సాళ్ళు చనిపోయేవి. గత్యంతరం లేక బీడుగా మారేది. వేసిన రసాయనిక ఎరువులు గడ్డి మొక్కలకు సత్తువుగా మారేవి.

కానీ, ఈ సంవత్సరం వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా "ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్" ద్వారా కాన్ఫిడార్, మాంకోజెబ్ (డి.ఎం.45) 5 ఎకరాలకు ఇవ్వడం జరిగింది. దానికి అదనంగా క్లోరోఫైరిఫాస్ 100 $m^2$ విత్తనాలకు కలిపి విత్తనశుద్ధి చేసినాను. విత్తిన 20 రోజులకు పొలంలోకి వెళ్ళిచూడగా ఒక్క మొలక కూడా చనిపోలేదు. నాకు చాలా సంతోషం కలిగింది. నా చందాగా క్లోరిఫైరిఫాస్ 470/- రూ. ఖర్చుపెట్టినందువల్ల నూటికి నూరు శాతం మొలకలు బ్రతికేందుకు వీలు కల్గినది. అలాగే, వేరుశనగ చెట్టుకు కాసిన విత్తనాలు ఒక్కటీ చెడిపోలేదు. అలాగే కాయలు కూడా మంచి అవుటన్ వచ్చినాయి.

**- ఎర్రిస్వామి, కోనంపల్లి వాటర్‌షెడ్ గ్రామం.**

### ఒక మంచి మాట

శ్రమదానం నిజమైన ఫలితానికి శ్రీకారం. అందుకే మా గ్రామంలో ఉండే గోపాలస్వామి గుడి కోనేరులోని పూడికలను శ్రమదానంతో తీసివేసిన తర్వాత, గుడికి వచ్చు భక్తులందరికీ కోనేరు ఉపయోగపడుతోంది.

**- ఓబుళపతి, యస్. వెంకటలక్ష్మి, యస్. తిమ్మాపురం.**

చేనుకు చెట్టు చెలికాడు, భూమికి రైతు జతకాడు. ఎద్దుకు కావడి మాను జతగాడు- అందుకే గ్రామంలో వీటిని సంరక్షించాలి. **- క్రిష్టయ్య, రైతు - చిన్నహోతూరు.**

వాటర్‌షెడ్ కార్యక్రమాలు లేకపోతే భార్యాపిల్లలను వదిలి బతుకు తెరువుకోసం వలస వెళ్ళేవాడిని.

**- నాగప్ప, వ్యవసాయ కూలీ, గంజికుంట గ్రామం.**

## ఈ మాసపు సూక్తి :

**తమ కార్యంబుఁ బరిత్యజించియుఁ బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్,**
**దమ కార్యంబు ఘటించుచున్ బరహితార్థవ్యాపృతుల్ మధ్యముల్,**
**దమకై యన్యహితార్థ ఘాతుకజనుల్ దైత్యుల్, వృధానార్థభం**
**గము గావించెడు వారలెవ్వరో యెరుంగన్ శక్యమే యేరికిన్ ?**

**- భర్తృహరి -**

**తాత్పర్యము :** తమ పనులను వదిలి ఇతరులకు పనులుచేసి పెట్టేవారు సత్పురుషులు, తమ పనులకు భంగం కాకుండా ఇతరులకు తోడ్పడేవారు మధ్యములు. తమ స్వంత పనుల కొరకు ఇతరుల పనులు చెడగొట్టేవారు మానవులలో రాక్షసులు. తమకు ఏ ప్రయోజనం లేకపోయినా ఇతరులకు నష్టం కలిగించేవారు అధములు.

**చర్చ :** భర్తృహరి సుభాషితాలలోని గొప్పదనమేమిటంటే, భర్తృహరి తాను జీవించిన కాలానికి సంబంధించిన సమాజపు అవగాహనతో విశ్లేషించినా, వైవిధ్య రూపాలతోవున్న నేటి సమాజానికి కూడా అది ఎంతో అతికినట్లుండటం. సమాజపు మనుగడ అంతా పరస్పర విశ్వాసం, సహకారంతోనే నడుస్తున్నది. ఎవరికీ సంబంధం లేకుండా బ్రతకాలనుకునే ఆలోచన మూర్ఖులు మాత్రమే చేయగలరు. మానవుడు మొదటి నుంచీ సంఘజీవి. మానవుడి మనుగడ అంతా సమూహాలతోనే ప్రారంభమైంది. ఇక భర్తృహరి విశ్లేషించిన వారిలో మొదటి రకం వారి గురించి చర్చించుకుందాం.

పరులకు సంబంధించిన విషయాలలో జోక్యం చేసుకునే వారిని భర్తృహరి నాలుగు రకాలుగా విశ్లేషించాడు. తమ పనులకు వదిలి ఇతరులకు పనులు చేసిపెట్టేవారిని సత్పురుషులుగా భర్తృహరి అభివర్ణించాడు. వీరు సమాజానికి మూలస్తంభాల్లాంటివారు. ప్రాచీన కాలం నుంచీ బౌద్ధ భిక్షువులు, యోగులు, సూఫీలు, బైరాగులు మొదలగువారు తమను గురించి ఆలోచించకుండా సమాజంలోని చెడును నిర్మూలించడానికి, ప్రజలను మంచి మార్గంలో నడిపించడానికి శ్రమించారు. వీరు సామాజిక భోగభాగ్యాలను విసర్జించారు. బౌద్ధ భిక్షువులైతే తమకు కావాల్సిన ఆహారాన్ని ఏ పూటకాపూట భిక్షాటన ద్వారా సేకరించుకుని సమాజంలోని ప్రజలయొక్క వ్యాధులకు వైద్యం చేస్తూ, ధర్మబోధనల ద్వారా ప్రజలను సన్మార్గులుగా మార్చేవారు. సత్పురుషుల కోవకు చెందినవారు ఆనాడు ఉన్నారు. ఈనాడు కూడా ఉన్నారు. ఐతే వచ్చిన తేడా అల్లా సత్పురుషులను ఆనాడు సమాజంలో గౌరవించి ఆరాధిస్తే, ఈనాడు వారు పనీపాటాలేని, చేతకాని వారుగా, తెలివితేట్లేని అమాయకులుగా చూడబడుతున్నారు. ఏ సమాజంలో ఐనా మానవ విలువల కొనసాగింపునకూ, సమాజంలో మంచిని పెంపొందించడానికి ఇటువంటి వ్యక్తులు ఎంతో అవసరం.

ఇక రెండో రకానికి చెందినవారు; తాము బ్రతకడం కోసం కష్టపడుతూ, ఇతరులకు అంతో ఇంతో సేవచేసేవారు. వీరు మధ్యములు. వీరు సక్రమమైన మార్గంలోనే తనకు, తనవారి పోషణకోసం పాటుబడుతూ మిగిలిన సమయాన్ని ఇతరులకు సాయం చేయడానికి ఉపయోగించేవారు. ఇలాగ బ్రతికేవారి సంఖ్య సమాజంలో ఎక్కువ శాతం ఉండాలి. వీరివల్లనే పాపపుణ్యాలు పరిగణనలోనికి వస్తాయి. తమకోసం ఇతరులకు హానిచేయకుండా బ్రతకటం ఎంతో అవసరం. ఇంతవరకూ బాగానే ఉంది. మిగతా రెండురకాల వారితోనే మనకు ఈనాడు వచ్చిన చిక్కంతా. వీరిలో తమ స్వంత పనులకోసం ఇతరుల పనులను చెడగొట్టేవారిని భర్తృహరి రాక్షసులుగా పరిగణించాడు. తమ రాజకీయ అవసరాలకోసం, తమ ధన సంపాదనకోసం ఇతరులను, వారి బ్రతుకులను వారిని బ్రతకనీయకుండా ప్రజల్ని తమ చుట్టూ తిప్పుకుంటూ ఉంటారు. ప్రతి గ్రామంలోనూ ఇలాంటి వారు మనకు దర్శనమిస్తారు. గ్రామం బాగుపడాలంటే వీరిని మనం దూరంగా ఉంచాలి. వీరి ప్రలోభాలకు లొంగరాదు. వీరిని నిజంగా భర్తృహరి చెప్పినట్లు రాక్షసులుగానే చూడాలి. మరొక భయంకరవర్గం కూడా ఉంది. వారు లాభమున్నా లేకున్నా కేవలం ఇతరులు బాగుంటే చూచి ఓర్వనివారు. వీరు సామాజానికి కేన్సరు లాంటివారు. ఇతరులు బాధపడితే, లేదా నాశనమైతే, చూచి ఆనందించే రకాలు. తమకు ఏ మాత్రం ప్రయోజనం లేకున్నా, సఖ్యంగా ఉండేవారిని చాడీలు చెప్పి విడదీసి, వారిలో వారికి కొట్లాటలు పెట్టి ఆనందించేవారు. ఎవరికీ ప్రయోజనం కలగని పనులు అంటే గడ్డివాములు తగులబెట్టడాలు, పచ్చని చెట్లు నరకడాలు, ఇవన్నీ ఇలాంటివారివల్లే వస్తాయి. గ్రామాలు బాగుపడాలంటే, మనుషులలో న్యాయప్రవర్తన, ధర్మం పెరగాలంటే, ఇలాంటి నీచులను అసహ్యించుకోవాలి. వారిని సమాజ జీవితానికి దూరంగా ఉంచాలి.

**వై.వి. మల్లారెడ్డి**

# ఈ మాసంలో వ్యవసాయం

## మామిడి

ఆర్.డి.టి. / యాక్షన్ ఫ్రటర్నా తరపున యిప్పటి వరకు లక్షలలో మామిడి అంట్లను వాటర్‌షెడ్ గ్రామాలలోని రైతులకు అందజేయడం జరిగింది. వాటి సంరక్షణ గురించి కొన్ని విషయాలు: మామిడి మొక్క నాటిన సంవత్సరం వరకు మొక్కకు ఒక మీటరు ప్రక్క కొమ్మలు రాకుండా జాగ్రత్త వహించాలి. ప్రక్క కొమ్మలు క్రింది నుంచి మామిడి చెట్టులా కాకుండా ఒక పొదలాగా పెరిగే అవకాశము ఎక్కువ. మొక్క మొదలు ఎత్తు పెరిగిన తరువాత కాండంపై 3-4 కొమ్మలు నలువైపులా వచ్చేలా వీలు కల్పించాలి. ఏపుగా పెరగని కొమ్మలు వెంటనే తీసివేయాలి. మొక్క పెరిగేటప్పుడు కొమ్మలు తీగలాగా సాగకుండా వంకరగా పెరిగే కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. ఈ విధంగా చేసిన చెట్టుకు మంచి ఆకారము వస్తుంది. కొమ్మలు కత్తిరించినప్పుడు ఎండు తెగులు రాకుండా కాపర్ ఆక్సీ క్లోరైడ్ / బ్లైటాక్స్ అను శిలీంద్రనాశిని పూయాలి. చెట్టు మూడు సంవత్సరముల వయస్సులో ఉత్తర-దక్షిణం వైపు గుబురుగా వున్న కొమ్మలను మధ్య మధ్యలో తీసివేయుటవల్ల సూర్యరశ్మి చెట్టులోపలకు ప్రవేశించుటకు బాగా వీలుకలుగుతుంది. దీనివల్ల చెట్టులోపలి కొమ్మలు కూడా త్వరగా ముదిరి పూతరావడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది. ఇదే కాకుండా చెట్లపైభాగం పచ్చగా ఉండి, లోపలి భాగంలో సూర్యరశ్మి సోకని కొమ్మలు ఆకులు రాల్చి, కొమ్మలు ఎండిపోతాయి. ఇటువంటి చెట్లలో కాయలు పైపాటునే కనిపించి చెట్టులోపల ఏమాత్రం కాయవు. మొక్కలపై మూడవ సంవత్సరం నుంచి దిగుబడి పొందుటకు అవకాశం కలదు. సక్రమంగా పెంచని మొక్కలలో మసితెగులు, పిండి పురుగు, పొలుసు పురుగులు వచ్చి చెట్లకు ఎక్కువ నష్టం కలుగజేస్తుంది.

### కత్తిరింపు - పంట దిగుబడి.

వ్యాపార సరళిలో పెంచే బెనిషాన్ రకం సంవత్సరంలో మార్చి నుండి జూన్ మరలా సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో చిగురిస్తుంది. ఒకవేళ వాతావరణం అనుకూలించక, సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో చిగురించకుంటే, పూతరాని కొమ్మలు జనవరి-ఫిబ్రవరి నెలల్లో పూతతోబాటు చిగురిస్తాయి. మరలా జూలై-ఆగష్టు నెలల్లో చిగురు వస్తుంది. కానీ, ఈ చిగురు రావటం, చెట్టు బలం మరియు వాతావరణ పరిస్థితులపైన ఆధారపడివుంటుంది. ప్రతి సంవత్సరం పూతరాని రకాలు కాయ కోసిన వెంటనే చిగురు రాకపోవటం ముఖ్యకారణంగా చెప్పవచ్చును. బెనిషాన్ రకం మే నెలాఖరులో కాయలు కోసిన తర్వాత రెమ్మలను 10 సెం.మీ. (4 అంగుళాలు) వెనుకకు కత్తిరించి వారం రోజుల తర్వాత 2 శాతం యూరియా ద్రావణాన్ని (ఒక లీటరు నీటిలో 20 గ్రా. యూరియా కలుపుటవల్ల 2 శాతం అవుతుంది.) పిచికారి చేసినయెడల కత్తిరించిన రెమ్మలపై చిగురు బాగా వస్తుందని పరిశోధనలలో తెలియవచ్చింది. కత్తిరించిన ఒక కొమ్మకు 2-5 ప్రక్క కొమ్మలు వస్తాయి. ఈ కొమ్మలలో ఏపుగా పెరిగే రెండు కొమ్మలనుంచి చెట్టు మొత్తం 1 గ్రాము కార్బన్‌డిజిమ్ లేక 3 గ్రా. రాగిధాతు శిలీంద్రనాశిని మరియు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ మందును 1 లీ. నీటిని కలిపి పిచికారి చేసిన పురుగులను, కొన్ని రోగాలను అరికట్టవచ్చు.

వర్షాలు ఆరంభం కాగానే మొదటి దఫా ఎరువులు వేయుటవల్ల వచ్చిన చిగురు ఏపుగా పెరుగుతుంది. మంచి సంరక్షణలోవున్న చెట్లైతే కొత్త చిగుర్లు 2, 3 దఫాలుగా కూడా వస్తాయి. ఈ విధంగా పంటకోత అయిన తర్వాత 10 సెం.మీ. రెమ్మలు కత్తిరించిన, కొత్త చిగురువచ్చి ప్రతి సంవత్సరం దిగుబడి పొందవచ్చు.

### కత్తిరింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

1. మొక్కలు నాటిన తర్వాత మొదటి 3 సంవత్సరాలలో పూత కొరకు కత్తిరించకూడదు. మెలి తిరిగిన కొమ్మలు, రెమ్మలు, ఎండిన మరియు రోగపూరితమైన కొమ్మలు మాత్రమే తీసేయ్యాలి.
2. పూతకొరకు 3 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రం కత్తిరింపులు చేపట్టాలి. ఈ రెమ్మలను 10 సెం.మీ.ల కంటే ఎక్కువగా కత్తిరించకూడదు.
3. సూర్యరశ్మి సోకుటకు వీలుగా ఉత్తర-దక్షిణంవైపు ఉన్న కొమ్మలను అక్కడక్కడా తీసేయ్యాలి.

మామిడిలో పరపరాగ సంపర్కం ద్వారా ఫలదీకరణ జరుగుతుంది. సాధారణంగా ఇది కీటకాలవల్ల జరుగుతుంది. ప్రకృతి సిద్ధంగా దాదాపు 50 శాతం ద్విలింగపూలు ఫలదీకరణం చెందకుండానే రాలిపోతాయి. ప్రకృతి సిద్ధంగా మామిడిలో అధికశాతం పిందె రాలిపోతుంది. ఇంతవరకు జరిగిన పరిశోధనల ప్రకారం కేవలం నూటికి ఒక్కటి చొప్పున ద్విలింగ పుష్పాలు మాత్రమే చివరివరకూ ఉండి కాయలుగా తయారౌతాయి. మిగతావి సహజంగా రాలిపోతాయి.

### మామిడిలో పిందె, కాయరాలడాన్ని అరికట్టడానికి :

1. చెట్ల పాదులలో మల్చింగ్ చేయుటవల్ల భూమిలో తేమ సమంగా వుంటుంది. చెట్టు నీటి ఎద్దడికి గురికావు.
2. కాయ పెరుగుతున్న దశలో నీరు పెట్టాలి.
3. పోషక పదార్థాలను ఆకులపై పిచికారి చేసి లోపాన్ని సవరించాలి.
4. పిందెకట్టిన సమయంలో పిందె రాలటాన్ని అరికట్టడానికి 20 పి.పి.యం. మోతాదులో ఎన్.ఏ.ఏ. పిచికారి చెయ్యాలి.

ప్రధాన చీడపీడలను సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్ని అవలంబించాలి.

### నీటి తడులు - పిందె కట్టుట - పిందె రాలుట :

పిందె కట్టే సమయంలో తేమ ఒక మోస్తరుగా వున్నా సరిపోతుంది. పిందె కట్టిన తర్వాత భూమిలో తేమ సరిపడేలా తడులిస్తే పిందె, కాయరాలడం తగ్గిపోవడమేగాకుండా, కాయ సైజు మరియు నాణ్యత పెరుగుతుంది.

## వేసవిలో ప్రొద్దుతిరుగుడు :

నీటి ఆధారం క్రింద ప్రొద్దుతిరుగుడు పంటకు ఏప్రిల్ నెల అనువైన మాసము. ఈ పంటకు ఎకరానికి వేయవలసిన ఎరువులు :

1. పశువుల ఎరువు 5-10 బండ్లు.
2. రసాయన ఎరువులు - దుక్కిలో 100 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 25 కేజీల యం.ఓ.పి. మరియు 25 కేజీల యూరియా.
3. విత్తిన 30 రోజులకు, 45 రోజులకు, 20 కేజీల చొప్పున యూరియా పైపాలుగా వేయాలి.

### ప్రొద్దుతిరుగుడు పంటలో నెక్రోసిస్ తెగులు :

ఈ తెగులు పంటను అన్ని దశల్లో ఆశించి నష్టపరుస్తుంది. ఈ వ్యాధి ఆకులపై మొదలు పెద్ద మచ్చలతో ప్రారంభమై క్రమంగా అన్ని భాగాలకు వ్యాపిస్తుంది. తెగులు సోకిన మొక్క భాగాలు నల్లగా మారి కుళ్ళిపోతాయి. చిన్న వయస్సులోనున్న మొక్కకు ఈ తెగులు సోకితే ఆ మొక్క చనిపోతుంది. ఈ తెగులు లక్షణాలు ఆకులపైనేకాక కాండం పువ్వు అడుగు భాగం, ఆకు కాడమీద కూడా గుర్తించవచ్చు. నల్లని లేదా గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఉధృతిని బట్టి మొక్క పెరుగుదల పూర్తిగా తగ్గిపోయి క్రమంగా ఎండిపోతుంది.

ఈ తెగులు విత్తనం ద్వారా రాదు. కాని పంటకు విత్తేముందు విత్తనాన్ని గేచో (70 డబ్ల్యు.యస్.) అనే పొడి మందుతో విత్తిన శుద్ధి (5 గ్రాముల మందు ఒక కిలో విత్తనానికి) చేయుట వల్ల తామర పురుగులు ఒక నెల వరకు పంటను ఆశించకుండా చేస్తుంది.

### మార్చినెల నుండి మే నెల వరకు వర్షాధార పంట భూములందు రైతులు చేపట్టవలసిన ముఖ్యమైన కార్యక్రమాలు :

ప్రతి రైతు 2/3 పైర్లకొకసారి మట్టినమూనాలు తీసి పరీక్ష చేయించుకొనవలసి ఉంటుంది.

1. మీ పొలముయొక్క భూసార పరీక్షలు చేయించి ఏయే పంటలకు ఏయే ఎరువులు ఎంతెంత మోతాదులో వాడాలో తెలుసుకొని అనవసరమైన రసాయనక ఎరువుల వాడకం తగ్గించి వృధా సేద్యం ఖర్చు తగ్గించుకోండి. మట్టినమూనాల సేకరణలో పాటించవలసిన విషయాలు, వాటి వెంట పంపవలసిన వివరాలు, పరీక్ష కేంద్రము నుండి లభించే సూచనలు సలహాలు గురించి 2004 సంవత్సరము మే నెల మాసపు సమాచారం చూడండి. ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలోనున్న గ్రామాలవారు వారివారి మట్టి నమూనాలను ధర్మవరం టౌన్ - బత్తలపల్లికి పోవు రస్తా ప్రక్కగా ఉన్న మార్కెట్ యార్డులోనున్న భూసార పరీక్షా కేంద్రమునకు పంపవలెను.
2. భూమి కోత, భూసార నష్టం అరికట్టడానికి, తేమను పరిరక్షించడానికి వర్షపునీరు / నీరు వృధాగా పొలము బైటకు పారిపోకుండా నిల్వ ఉండడానికి వాలుకు అడ్డంగా మట్టి / గుళకరాళ్ళ / రాళ్ళ కట్టలు వేసుకోవాలి.
3. కుంట కట్టలు యిదివరకే వేసుకున్న రైతులు, ఎక్కడన్నా తెగిపోయిన దగ్గర కట్టను భద్రపరచుకోవాలి. కట్టడాల్లో రాళ్ళు వదులుగా ఉంటే వాటిని తగువిధంగా పాదించి గట్టి పరచుకోవాలి.
4. లోతు దుక్కి : ప్రతి రెండు సంవత్సరాల పంటల తర్వాత వేసవి కాలంలో తొలకరి వానలు పడిన వెంటనే లోతుదుక్కి చేసిన భూమి, నీటిని ఎక్కువగా పీల్చుకొని తేమను నిల్వ ఉంచుకుంటుంది. దీని వలన పైరుకు లాభమౌతుంది.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990